మదురైలో సరిహద్దులో

కళ్లలగర్‌కు ఘనస్వాగతం

● మూండ్రుమావడి ప్రాంతానికి పోటెత్తిన భక్తులు



పల్లకీలో ఊరేగుతున్న కళ్ళలగర్ (ఇన్‌సెట్‌లో) సర్వాలంకరణలో స్వామివారు

టి.నగర్ మే 11 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటైన కళ్ళలగర్ ఆలయ చిత్తిరై ఉత్సవాలు ఊపందుకున్నాయి. రెండు రోజులపాట భక్తులను అనుగ్రహించిన కళ్ళలగర్‌స్వామివారు శనివారం సాయంత్రం స్వర్ణపల్లకీలో మదురై నగరానికి బయలుదేరారు. వైగై నదిలో వేంచేసి లక్షలాదిమంది భక్తులకు దర్శన మిచ్చేందుకు బయలుదేరిన ఆ కళ్ళలగర్ స్వామి 18వ పడి కరుప్పణ్ణస్వామి వద్ద అనుజ్ఞ స్వీకరించారు. సాయంత్రం ఆరుగంటలకు కొండప్పనాయకర్ మండపంలో వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ సందర్భంగా స్వామివారికి నూపుర గంగా తీర్థ అభిషేకం, దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కండాంగి పట్టు వస్త్రాలు ధరించి, పొన్నుకర్ర, చెర్నాకోల పట్టుకుని పరివారంతో మంగళవాయిద్యాలు, బాణా సంచా పేలుళ్ల నడుమ కళ్ళలగర్ స్వర్ణ పల్లకీలో ఊరేగుతూ పొయ్‌గైకరై పట్టి, కళ్లంద్రి, అప్పన్ తిరుప్పతి, జమీందార్ మండపం తదితర ప్రాంతాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తర్వాత సుందరరాజన్‌పట్టి, మరవర్ మండపంలో వేంచేశారు. అక్కడి నుండి బయలుదేరి కడచ్చనేందర్ చేరుకున్న కళ్ళలగర్ స్వామి వేకువజాము 3 నుండి 4 గంటలవరకు భక్తులకు దర్శనమిన అనంతరం స్వామివారు మదురై మహానగర సరిహద్దు ప్రాంతమైన మూండ్రుమావడి ప్రాంతానికి ఆదివారం వేకువజాము 5.30 గంటలకు చేరుకున్నారు. అప్పటికే ఆ ప్రాంతంలో కళ్ళలగర్‌ను స్వాగతించేందుకు వేలాది మంది భక్తులు గుమికూడారు. వ్రతమాచరిస్తున్న భక్తులంతా అళగర్, కరుప్పణ్ణసామి, ఆంజనేయస్వామి వేషధారణతో పెద్ద పెద్ద దివిటీలు పట్టుకుని నృత్యం చేశారు. మహిళలు చక్కెర దీపాలు పట్టుకుని స్వామి వారికి నీరాజనాలు సమర్పించారు. అక్కడి నుండి బయలుదేరిన స్వామి వారి కే.పుదూరు మారియమ్మన్ ఆలయం, రిజర్వులైన్ మారియమ్మన్ ఆలయం, సాయంత్రం అవుట్‌పోస్ట్ మారియమ్మన్ ఆలయంలో వేంచేసారు. సాయంత్రం 5 గంటలకు అంబలక్కార మండపంలో వేంచేశారు. అక్కడి నుండి బయలుదేరిన కళ్ళలగర్ స్వామి తల్లాకుళం ప్రసన్న వెంకటేశ పెరుమాళ్ ఆలయాన్ని చేరుకుంటారు. ఆదివారం అర్ధరాత్రి కళ్ళలగర్‌స్వామి స్వర్ణ అశ్వవాహనంపై ఆసీనులవుతారు. అదే సమయంలో శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో గోదాదేవి (ఆండాళ్) ధరించి పంపిన 'శూడికొడుత్త' పూలమాలను ధరిస్తారు. స్వర్ణ అశ్వవాహనంపై బయలుదేరి తల్లాకుళం కరుప్పణ్ణసామి ఆలయం చేరుకుంటారు. అక్కడి నుంచి వైగై నదీ ప్రాంతాన్ని చేరుకుంటారు. సోమవారం వేకువజాము కళ్ళలగర్‌స్వామి స్వర్ణ అశ్వవాహంలో లక్షలాదిమంది భక్తుల నడుమ వైగైనదిలో వేంచేస్తారు. ఈ కళ్ళలగర్ ఆగమన ఉత్సవాలను పురస్కరించుకుని వైగై నది చుట్టూ పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపడుతున్నారు.



కళ్ళలగర్‌కు చక్కెర దీపంతో స్వాగతం పలుకుతున్న భక్తురాలు

ఆదివారం మళ్లీ అకాల వర్షం

● చల్లబడిన రాజధాని నగరం



చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని కురిసిన వర్షానికి అగ్నినక్షత్రం ఎండ వేడిమికి తల్లడిల్లిన నగరవాసులు ఊరట చెందారు. నగరంలోని వేళచ్చేరి, రాయపేట, మధురవాయల్, పూందమల్లి, తాంబరం, మీనంబాక్కం ఎన్నూరు, మీంజూరు, పొన్నేరి తదితర ప్రాంతాల్లో అరగంటసేపు ఉరుములు మెరుపులు, పెనుగాలలు వీచాయి. అదే సమయంలో చెదురుమదురుగా వర్షం కురవటంతో వాతావరణం చల్లబడింది. గత ఆదివారం కూడా అగ్నినక్షత్రం ఆరంభం రోజే వర్షం కురిసింది. ఆ రోజు కూడా పగలు 12 గంటల దాకా ఎండవేడి అధికమై నగరవాసులు ఉక్కపోతతో అలమటించారు. ఆ తర్వాత కురిసిన అకాల వర్షంతో నగరమంతటా చల్లదనం ఆవరించింది. ఈ ఆదివారం కూడా కురిసిన వాన జల్లులకు నగరమంతటా వాతావరణం చల్లబడింది. అక్కడక్కడా రహదారులలో వాననీరు ప్రవహించడం మినహా ఈ వర్షం నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకపోవటం విశేషం.

పది జిల్లాలకు ...

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పది జిల్లాల్లో ఈ నెల 14,15 తేదీల్లో భారీవర్షం కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో.. ఈ నెల 13న దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, ఆగ్నేయ బంగాళాఖాతంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశముంది. అదే సమయంలో పశ్చిమ గాలుల వేగం మార్పు కారణంగా, ఈ నెల 13న నీలగిరి, కోవై, ఈరోడ్, కృష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూర్, వేలూరు తదితర జిల్లాలు, 14,15 తేదీల్లో నీలగిరి, కోవై, ఈరోడ్, కృష్ణగిరి, ధర్మపురి, సేలం, నామక్కల్, తిరుపత్తూర్, వేలూరు, తిరువణ్ణామలై తదితర పది జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. అలాగే, పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 29 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

ముందస్తు వ్యూహం

ఈపీఎస్‌తో బీజేపీ నేతల భేటీ

ప్యారీస్, మే 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికలకు సమాయత్తం అయ్యే విషయంపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామితో బీజేపీ అగ్రనేతలు సమావేశమయ్యారు. డీఎంకే కూటమిని ఓడించేందుకు ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అంశాలు, సమష్టిగా రెండు పార్టీలు పనిచేయడంపై మాట్లాడినట్లు సమాచారం. సోమవారం 71వ వసంతంలోకి ఎడప్పాడి పళనిస్వామి అడుగుపెడుతున్న నేపథ్యంలో, ఆయనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్, ఎం.చక్రవర్తి, కరునాగరాజన్, త్యాగరాజన్, వినోజ్ పి.సెల్వం సహా పలువురు గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న ఎడప్పాడి పళనిస్వామి నివాసానికి వెళ్లారు.. ఈపీఎస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నాడీఎంకే - బీజేపీ కూటమి తరుపున అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కొవడం బూత్ కమిటీల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి వారు చర్చించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.



ఈపీఎస్‌తో నయినార్ నాగేంద్రన్, కేంద్రమంత్రి ఎల్.మురుగన్ తదితరులు

బరువు తక్కువ పిల్లల

సంరక్షణకు ఆరోగ్య బీమా

● మంత్రి సుబ్రమణ్యం ప్రకటన



తంజావూరు వైద్యకళాశాల ఆస్పత్రిలో అద్దె గదులను ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బరువు తక్కువగా జన్మించే పసికందుల సంరక్షణ కోసం త్వరలో వైద్య బీమా సదుపాయం కల్పించనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. తంజావూరులో రూ.11.82 కోట్లతో నిర్మించిన కొత్త ఆసుపత్రి భవనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అదే సమయంలో రూ.13 కోట్లతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి కొవి చెళియన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇటీవలి కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య రెట్టింపు అయ్యిందని, ఆ ఆసుపత్రులలో మెరుగైన వైద్యసదుపాయాలు లభిస్తుండటమే దీనికి కారణమని చెప్పారు. ఉన్నత వర్గాలకు చెందినవారు కూడా ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్సలు పొందాలన్న ఉద్దేశంతో తంజావూరు వైద్య కళాశాల ఆసుపత్రిలో ఫీజులు తీసుకుని చికిత్సలందించే విభాగాలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో తిరుచ్చి, తంజావూరు, సేలం సహా 13 జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ విభాగాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలోనే మరో 9 జిల్లాల్లోనూ ఈ విభాగాలను ప్రారంభించనున్నామని చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రులలో రూమ్ అద్దె రూ.8వేల నుండి రూ.9వేల దాకా చెల్లించాల్సి ఉందని, తంజావూరు వైద్యకళాశాల ఆసుపత్రిలో రూము అద్దె రోజుకు రూ.1000లు చెల్లిస్తే చాలునని చెప్పారు. రాష్ట్రంలో ప్రతియేటా 9.50 లక్షల ప్రసవాలు జరుగుతున్నాయని, సుమారు 50 వేల పసికందులు నిర్దేశిత బరువు కంటే తక్కువ బరువుతో జన్మిస్తున్నాయని చెప్పారు. ఇలా బరువు తక్కువగా జన్మించే పసికందుల సంరక్షణ కోసం త్వరలోనే వైద్య బీమా సదుపాయాలం కల్పించనున్నామని మంత్రి సుబ్రమణ్యం చెప్పారు.

ఎగుమతులు, ఆర్థికాభివృద్ధిలో

రాష్ట్రం ముందంజ

ప్రభుత్వ ప్రకటన



అడయార్, మే 11 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వ హయాంలో ఎగుమతి, ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా 2021 మే 7వ తేదీ ఎంకే స్టాలిన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మధ్యకాలంలో 897 అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నట్టు పేర్కొంది. ముఖ్యంగా ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం 9.69 శాతం ఉందని, ఇది దేశంలో మొదటి స్థానంలోనూ, ఎగుమతుల్లో మొదటి స్థానంలో ఉందని తెలిపింది. తోళ్ళ ఉత్పత్తులు, జౌళి రంగంలోనూ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందనీ, దేశంలో చర్మ వస్తు ఉత్పత్తుల తయారీలో దేశంలోనే 38 శాతం ఒక్క తమిళనాడులోనే అవుతున్నాయని పేర్కొంది. ప్రభుత్వ వైద్య ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుల సంఖ్యలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందనీ, అత్యధిక శాతం పంట భూములున్న రాష్ట్రాల్లో తమిళనాడు అగ్రస్థానంలో ఉందని, పేదరిక నిర్మూలన, అత్యధిక పరిశ్రమలు ఉన్న రాష్ట్రాల్లో, పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల్లో అధిక శాతం మహిళా కార్మికులు ఉన్న రాష్ట్రంగా ఉంది పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్య కేంద్రాలు ఉన్న ముంబై, పూణె, హైదరాబాద్, బెంగళూరు నగరాల కంటే చెన్నై నగరంలో 24.5 శాతం వృద్ధిరేటుతో 94121 స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది.

సమ్మెలో పాల్గొన్న టీచర్లకు ఊరట

● క్రమశిక్షణ చర్యల రద్దు ● సమ్మెకాలం పని దినాలుగా గుర్తింపు

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాక్టో జియో ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొన్న ఉపాధ్యాయులపై గత అన్నాడీఎంకే ప్రభుత్వం చేపట్టిన క్రమశిక్షణా చర్యలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు ఉత్తర్వు వెలువరించింది. 2016 -17, 2019 సంవత్సరాలలో జాక్టోజియో ఆధ్వర్యంలో సమ్మె చేసిన దినాలను పనిదినాలుగా పరిగణించనున్నట్లు ప్రభుత్వం ఆ ఉత్తర్వులో పేర్కొంది. సస్పెన్షన్ కాలాన్ని కూడా పనిదినాలుగానే పరిగణించనున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. సమ్మె చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలన్నింటిని రద్దు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇక సమ్మె కాలంలో బదిలీ వేటుకు గురైన టీచర్లను బదిలీలకోసం నిర్వహించే కౌన్సెలింగ్‌లో ఇంతకు ముందు వారు పనిచేసిన ప్రాంతాలకు మళ్ళీ బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని సీఎం స్టాలిన్ ఉత్తర్వు జారీ చేశారు. ఇటీవలే ఉపాధ్యాయులకు డీఏ కూడా పెంచామని, ఆ దిశగానే ఉపాధ్యాయుల సేవకు ఎలాంటి మచ్చ ఏర్పడకూడదనే తలంపుతోనే గత ప్రభుత్వం వారిపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలన్నింటినీ రద్దు చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలో ఉపాధ్యాయులందరికీ ఊరట కలిగిస్తుందన్నారు.

మాజీ మంత్రి విజయభాస్కర్‌కు ఐటీ సమన్లు




చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): భూకబ్జా కేసు విచారణలో భాగం గా అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్‌కు ఆదాయపు పన్నుల శాఖ సమన్లు పంపింది. ఈ నెల 23న జరిగే విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. కరూరులో వందకోట్ల విలువైన భూమిని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు మేల్‌కరూరు రిజిస్ట్రార్ కరూరు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు యువరాజ్, ప్రవీణ్, రఘు, సిద్ధార్థన్, మారప్పన్, సెల్వరాజ్, శోభనా అనే ఏడుగురిపై ఎనిమిది సెక్షన్ల కింద గత యేడాది కేసు నమోదైంది. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చే అవకాశం ఉందని అనుమానించిన మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ కరూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టులో బెయిలు పిటిషన్ వేసి పరారయ్యారు. ఆ తర్వాత ఈ కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ చేశారు. సీబీసీఐడీ పోలీసులు విజయభాస్కర్, ఆయన సోదరుడు శేఖర్‌లను నిందితులుగా చేర్చి విచారణ ప్రారంభించారు. అదే రోజున స్థలం యజమాని శోభన తండ్రి ప్రకాష్ కరూరు నగర పోలీసుస్టేషన్‌లో మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్, ఆయన సోదరుడు శేఖర్, ప్రవీణ్ సహా 13 మందిపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రూ.వంద కోట్ల విలువైన భూకబ్జా కేసులో ఎంఆర్ విజయభాస్కర్ ఈ నెల 23న జరుగనున్న విచారణకు హాజరుకావాలంటూ ఆదాయపు పన్నుల శాఖ అధికారులు సమన్ జారీ చేశారు.

ఈ యేడాది రెండు వేల ఆలయాలకు

కుంభాభిషేకం

● దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు వెల్లడి



అడయార్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఈ యేడాది అఖరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 200 ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహిస్తామని రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖా మంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన మంత్రి శేఖర్ బాబు మాట్లాడుతూ, కన్నియాకుమారి జిల్లాలోని మండైక్కాడు భగవతి అమ్మన్ ఆలయంలో రాజగోపురం కుంభాభిషేకం ఆదివారం చేశామన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఒక్క ఆలయానికి కూడా కుంభాభిషేకం నిర్వహించలేదన్నారు. కానీ, డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. ఆదికేశవ పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం జరిపించామన్నారు. అలాగే, మహాదేవర్ ఆలయ 2022లో తనిఖీలు చేసి తాజాగా కుంభాభిషేకం నిర్వహించామన్నారు. మండైక్కాడు భగవతి అమ్మన్ ఆలయంలో రూ.1.38 కోట్లతో జీర్ణోద్ధారణ పూర్తి చేసి, ఆదివారం కుంభాభిషేకం నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో రూ.1.15 కోట్లతో గ్రంథాలయాలను నెలకొల్పేందుకు శంకుస్థాపన చేస్తామన్నారు. అలాగే, ఈ యేడాది ఆఖరునాటికి రెండువేల ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. సుపరిపాలన సాగుతున్న డీఎంకే ప్రభుత్వ పాలనలో సంఘలకు చోటు లేదని మంత్రి శేఖర్‌బాబు అన్నారు.

సమాచార దృష్టి

రేపు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై, అన్నానగర్, గిండి తదితర డివిజన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరాలు జరుగున్నాయి. అన్నాసాలై పరిధిలో చింతాద్రిపేట లబాండ్ వీధిలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, అన్నానగర్ పరిధిలో అన్నానగర్ 11వ మెయిన్ రోడ్డు ఐదవ వీధిలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, గిండి పరిధిలో కేకే నగర్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యా లయంలో ఉదయం 11 గంటలకు గ్రీవెన్స్ జరగనుంది. ఈ శిబిరాల్లో ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఫెయిలైన విద్యార్థులకు ముఖ్యమంత్రి 'ఎస్ఎంఎస్'

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ముఖ్యమంత్రి పేరుతో 'ఎస్ఎంఎస్'లు పంపుతున్నారు. ఇటీవల విడుదలైన ప్లస్ టూ పరీక్షల్లో 39,352 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేదు. ఫెయిలైన విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం నష్టపోకుండా జూన్ 25వ తేది సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, ఫెయిలైన విద్యార్థులకు సెల్‌ఫోన్లకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారు. అందులో.. 'ఉత్తీర్ణత సాధించలేదని విద్యార్థులు నిరాశచెందొద్దు. వెంటనే సప్లిమెంటరీ పరీక్షలో పాల్గొని విజయం సాధించండి. మీరూ ఉన్నత విద్యలో చేరి, జీవితంలో సాధిస్తారు. అందుకు అవసరమైన అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది - ముఖ్యమంత్రి' అంటూ ఎస్ఎంఎస్‌లో పేర్కొన్నారు.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాం ఇన్‌ఫ్లో పెరిగింది. కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వేసవి వర్షాల కారణంగా డ్యాంకు సెకనుకు 876 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం డ్యాం నీటి మట్టం 108.19 అడుగుల చొప్పున 75.86 టీఎంసీల నీటి నిల్వలుండగా, తాగునీటి అవసరాలకు డ్యాం నుంచి వెయ్యి ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నేడు ఊటీకి ముఖ్యమంత్రి

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలో సోమవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పర్యటించనున్నారు. నగరం నుంచి సోమవారం ఉదయం 10 గంటలకు విమానంలో కోయంబత్తూర్‌కు వెళ్లనున్న ముఖ్యమంత్రి, అక్కడి నుంచి రోడ్డు మార్గంగా ఊటీ వెళ్లనున్నారు. ఐదు రోజులు ఊటీలో బసచేయనున్న సీఎం, ఈ నెల 15న పుష్ప ప్రదర్శన ప్రారంభించనున్నారు. పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ దొడ్డబెట్టలో గిరిజనులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఊటీ పర్యటన ముగించుకుని ఈ నెల 16వ తేది రాత్రి లేదా 17వ తేది నగరానికి వస్తారని సచివాలయం వర్గాల సమాచారం.

పాక్షికంగా రద్దయిన విల్లుపురం-తిరుపతి ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి) విల్లుపురం నుంచి ఉదయం 5.40 గంటలకు తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ (నెం.16854) ఆదివారం నుంచి జూన్ 3వ తేది వరకు తిరుపతికి బదులు కాట్పాడి వరకు మాత్రమే నడుపుతారు. మరుమార్గంలో తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు విల్లుపురంకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ (16853) తిరుపతికి బదులు కాట్పాడి నుంచి బయల్దేరనుంది. అలాగే, తిరుపతి నుంచి ఉదయం 7.35 గంటలకు కాట్పాడికి బయల్దేరే ప్యాసింజర్ రైలు (67205) ఆదివారం నుంచి జూన్ 3వ తేది వరకు మధ్యాహ్నం 1.40 గంటలకు బయల్దేరుతుంది. ఇక, కాట్పాడి నుంచి ఉదయం 10.30 గంటలకు జోలార్‌పేట వెళ్లే ప్యాసింజర్ రైలు (66017), మరుమార్గంలో జోలార్‌పేట నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు కాట్పాడికి వెళ్లే ప్యాసింజర్ రైలు (60018) ఆదివారం నుంచి జూన్ 3వ తేది వరకు పూర్తిగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

14 నుంచి సప్లిమెంటరీ దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల దరఖాస్తు స్వీకరణ ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది. ఇటీవల వెలువడిన ప్లస్ టూ ఫలితాల్లో ఉత్తీర్ణత కాని వారు, ప్లస్ వన్ అరియర్స్ ఉన్న వారు, ప్రైవేటు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాల ద్వారా, ప్రైవేటు అభ్యర్థులు విద్యా జిల్లాలో ఏర్పాటుచేసిన సేవా కేంద్రాల ద్వారా ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమర్పణకు చివరి తేది 29 కాగా, ఆలోపు దరఖాస్తు చేసుకోలేని వారు 30,31 తేదీల్లో రూ.1,000 ప్రత్యేక రుసుముతో తత్కాల్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు సంబంధించి www.dge. tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించి తెలుసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలియజేసింది.

'యంగ్ క్రియేటర్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): 'భారతి దాసన్ యంగ్ క్రియేటర్ పురస్కారానికి దరఖాస్తు చేయాలని తమిళ అభివృద్ధి శాఖ డైరెక్టర్ అవ్వై అరుళ్ ఒక ప్రకటనలో తెలిపారు. భారతి దాసన్ జయంతిని పురస్కరించుకొని 'భారతిదాసన్ యంగ్ క్రియేటర్ పురస్కారం అందజేయనున్నట్లు ఇటీవల శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, తమిళ భాషాభివృద్ధికి కృషిచేస్తున్న 35 నుంచి 40 ఏళ్ల పురుషులు, మహిళలు యువ రచయితలు, కవులు అని రెండు విభాగాల్లో పురస్కారాలు అందించనున్నారు. పురస్కార గ్రహీతలకు రూ. లక్ష నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. దరఖాస్తులను www.tamilvalarchithurai.tn.gov.in/awards అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని http: awards.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 23వ తేదిలోపు సమర్పించవచ్చు. అలాగే ఎగ్మూర్‌లోని తమిళ భాషాభివృద్ధి డైరెక్టర్ కార్యాలయంలో సమర్పించవచ్చు. వివరాలకు 044-28190412, 413 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.


తిరుప్పూర్‌లో స్తంభించిన బనియన్ల ఎగుమతి

పార్యీస్, మే 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కొన్ని రోజుల వరకు బనియన్లు సరఫరా చేయరాదని ఉత్తరాది రాష్ట్రాల్లోని వాణిజ్య సంస్థలు విజ్ఞప్తి చేయడంతో తిరుప్పూర్‌లో 40శాతానికి పైగా బనియన్ల ఎగుమతి ఆగిపోయింది. బనియన్ పరిశ్రమలకు పేరుగాంచిన తిరుప్పూర్ నుంచి పొరుగు రాష్ట్రాలకు బనియన్లు తరలిస్తుంటారు. సంవత్సరానికి సుమారు రూ.25వేల కోట్ల మేర సరుకులు ఇక్కడి నుంచి రవాణా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, భారత-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వ హెచ్చరికల మేరకు తిరుప్పూర్ పరిశ్రమల్లో తయారుచేసిన బనియన్ల వ్యాపారం మందగించింది. దేశంలోని పలు ప్రాంతాల్లో సైనికుల మాక్ డ్రిల్, తనిఖీల కారణంగా ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేయాల్సిన బనియన్లు 40 శాతానికి పైగా పరిశ్రమల్లో పేరుకుపోయాయి. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం కాల్పుల విరమణపై ప్రకటించిన విరమణ నేపథ్యంలో సహజ వాతావరణం ఏర్పడిన తర్వాత మళ్లీ బనియన్ ఎగుమతులు ప్రారంభమవుతాయని తిరుప్పూర్ కార్మికులు ఆశాభావం వ్యక్తం చేశారు.



బనియన్ తయారీ పనుల్లో కార్మికులు

సీమాన్ పార్టీకి నాగలిపట్టిన రైతు గుర్తు



పార్యీస్, మే 11 (ఆంధ్రజ్యోతి): నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే)కి కేంద్ర ఎన్నికల సంఘం 'నాగలిపట్టిన రైతు' గుర్తు కేటాయించిందని ఆ పార్టీ అర్గనైజర్ సీమాన్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, 2010వ సంవత్సరం తమ పార్టీకి కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపునిచ్చిందని, అప్పటినుండి జరిగిన ఎన్నికల్లో గెలవకపోయినా తమకు ఓటు శాతం మాత్రం పెరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ తమకు ఇంతకు ముందు ఎన్నికల గుర్తుగా చెరుకు గడ పట్టుకున్న రైతు చిహ్నాన్ని కేటాయించిందని, అయితే, గత పార్లమెంటు ఎన్నికల్లో ఆ గుర్తుకు బదులు మైక్ గుర్తును కేటాయించిందని వివరించారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు కేటాయింపుపై కేంద్రానికి రాసిన లేఖవల్ల తమకు మళ్లీ నాగలిపట్టిన రైతు గుర్తు దక్కిందని, అందువల్ల పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించిందన్నారు.

సకాలంలో నిర్మాణం పనులు పూర్తిచేయండి

కలెక్టర్ ప్రతాప్ ఆదేశం



తిరుత్తణి, మే 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనప గదుల నిర్మాణం పనులను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ప్రతాప్ అధికారులను ఆదేశించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రప్రభుత్వం చిల్డ్రెన్స్ స్కూల్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవెలప్మెంట్ ప్రాజెక్ట్ కింద రూ.385.75 లక్షలతో 252 పాఠశాలల్లో 418 గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాఠశాల ప్లే గ్రౌండ్ సహా కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ వంటి నిర్మాణం పనులు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆదివారం ఉదయం అధికారులతో కలిసి కలెక్టర్ పనులకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, తరగతి గదుల నిర్మాణాలు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సహా పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గర్భం దాల్చిన పదమూడేళ్ల బాలిక

- ఏడుగురు మైనర్లు సహా 12 మంది అరెస్ట్
- సహకరించిన తల్లి కూడా...

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలో పదమూడేళ్ల బాలిక గర్భం దాల్చిన వ్యవహారంలో ఏడుగురు మైనర్ బాలురు సహా 12 మందిని అరెస్ట్ చేశారు. అలాగే, ఈ ఘటనకు సహకరించిన బాలిక తల్లిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. పల్లావరానికి చెందిన 13 ఏళ్ల బాలిక 8వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు పనులకు వెళ్లిన సమయంలో, ఇంటికి వాటర్ క్యాన్లు వేసే యువకుడు బాలికతో పరిచయం ఏర్పరచుకున్నాడు. వివాహం చేసుకుంటానని నమ్మించిన యువకుడు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న యువకుడి స్నేహితులు కూడా బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డారు. కొద్దిరోజులు బాలిక అస్వస్థతకు గురికావడంతో తల్లి ఆమెను చెంగల్పట్టు ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి బాలిక గర్భం దాల్చినట్లు తెలిసింది. ఈ వ్యహారంపై పిల్లల సంక్షేమ శాఖ అధికారులు శంకర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, ఈస్ట్ తాంబరంకు చెందిన నందకుమార్, సంజయ్, ముడిచ్చూర్‌కు చెందిన సూర్య), ఈసా పల్లావరానికి చెందిన నిక్సన్ సహా 8 మంది బాలురను అరెస్ట్ చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచిన అనంతరం న్యాయమూర్తి ఉత్తర్వులతో యువకులను జైలుకు, మైనర్ బాలురను జువైనల్ హోంకు తరలించారు. కాగా, పోలీసుల విచారణలో కుమార్తె దగ్గరకు పలువురిని పంపించిందని తేలడంతో బాలిక తల్లిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రధాన జలాశయాల వద్ద వచ్చే వారం మాక్‌డ్రిల్

- రాష్ట్రప్రభుత్వం ప్రకటన

పార్యీస్, మే 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో వచ్చే వారం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధవాతావరణం నెలకొన్న నేపథ్యంలో, దేశ పౌరులను అప్రమత్తం చేసేలా కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 7వ తేదీ నుంచి పౌరభద్రతా శిక్షణ, మాక్‌డ్రిల్‌ను తూత్తుకుడి వావూసి హార్బర్, తూత్తుకుడి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో నిర్వహించారు ఈ నేపథ్యంలో, వచ్చే వారం రాష్ట్రంలోని ప్రధాన ఆనకట్టలు, జలపాతాలు, చెరువుల వద్ద నిర్వహించనున్న మాక్‌డ్రిల్ గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజల రక్షణ కోసమే నిర్వహిస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం స్పష్టంచేసింది. మాక్‌డ్రిల్ విజయవంతం అయ్యేందుకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరింది. ఇదిలా వుండగా వచ్చే వారం గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్, కలెక్టర్లు ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ జరుగుతుందని సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

వీధి కుక్క దాడిలో పలువురికి గాయాలు



చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్ళిన బాధితులు

పార్యీస్, మే 11 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా సంఘగిరి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఉదయం వీధి కుక్క దాడిలో 20 మందికి పైగా గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. సంఘగిరి రామస్వామినగర్ భవానీ రోడ్డు మద్దాలికాలనీ, ఎడప్పాడి రోడ్డు ప్రాంతాల్లో వీధి కుక్క కాటుకు గురైనవారిలో మున్సిపల్ సూపర్‌వైజర్ అలగేశన్, శానిటేషన్ అధికారి విజయ్‌కుమార్, కుమార్, శ్రీనివాసన్ సహా నలుగురు సిబ్బంది కూడా ఉండటం గమనార్హం. వీరితో పాటు కుక్క కాటుకు గురైన 20 మందితో సంఘగిరి ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్ళారు. వీధి కుక్క దాడికి గురైన వారిని ఆస్పత్రికి తరలించిన వారి బంధువులు, స్థానికులు ఆస్పత్రి ప్రాంగణంలో తమ ప్రాంతంలో కుక్కల బెడదను నివారించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో, ఆస్పత్రి చీఫ్ డాక్టర్ శరవణకుమార్ నేతృత్వంలోని వైద్యులు క్షతగాత్రులకు ఇంజక్షన్, గ్లూకోస్ ఎక్కించి వారిని ప్రత్యేక గదిలో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ఒకే రోజు కుక్క కాటుకు 20 మంది గురైన విషయం తెలిసి, ఆస్పత్రి చేరుకున్న సంఘగిరి మున్సిపల్ కమిషనర్ శివరంజని వీధి కుక్కల సంచారాన్ని కట్టడి చేసే చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

'ఫిట్ జీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

- రూ.7.5 లక్షల విలువైన చెక్కుల స్వాధీనం
- 195 గుర్తింపు కార్డులు కూడా

అడయార్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు శిక్షణ పేరుతో విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఫిట్ జీ శిక్షణా కేంద్రానికి చెందిన నాలుగు ప్రాంతాల్లో చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీసీబీ) పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.7.5 లక్షల విలువైన చెక్కులు, 195 మంది విద్యార్థులకు చెందిన గుర్తింపుకార్డులను స్వాధీనం చేసుకున్నారు. కీల్పాక్కం, కేకే నగర్ ప్రాంతాల్లో ఉన్న ఫిట్ జీ శిక్షణా కేంద్రాల్లో విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసం చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ అరుణ్‌కు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశం మేరకు సీసీసీబీ పోలీసులు రంగంలోకి దిగి ఫిట్ జీ కేంద్రానికి చెందిన నాలుగు బ్రాంచ్‌ల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. అలాగే, శిక్షణ కోసం వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులను కూడా స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఫిట్ జీ కేంద్రంలో మోస పోయిన విద్యార్థులు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చని సీసీసీబీ పోలీసులు సూచించారు. ఈ సెంటర్ తమిళనాడు రీజియన్ హెడ్ అంకూర్ జైన్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఆన్‌లైన్ రమ్మీకి మరొకరి బలి

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీలో నగదు కోల్పోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పొన్నేరికి చెందిన మురుగన్ ఏటీఎంలో నగదు నింపే ఓ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. అతను ఆన్‌లైన్ రమ్మీలో సుమారు రూ.6 లక్షల వరకు కోల్పోయినట్లు సమాచారం. దీంతో, తీవ్ర మనస్తాపం చెందిన మురుగన్, శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు సీఎంకు పోస్ట్‌కార్డులు పంపి నిరసన

- నర్సుల సంఘం ప్రకటన

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం నర్సులను క్రమబద్ధీకరించాలి సహా 25 డిమాండ్లతో నర్సుల సంఘం దశల వారీ చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగా, తమ కోర్కెలను పోస్టుకార్డులో రాసి ముఖ్యమంత్రి పంపే కార్యక్రమం సోమవారం చేపట్టనున్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో జూన్ 26న నగరంలో 24 గంటల ధర్నా, జూలై 17న స్థానిక డీఎంఎస్ ప్రాంగణంలో ఆందోళన చేపట్టనున్నట్లు నర్సుల సంఘం ప్రకటించింది.

పసికందు విక్రయం కేసులో 10 మంది అరెస్ట్

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): కారైక్కుడి తిరునల్లారులో నెల పసికందును విక్రయించిన వ్యవహారంలో 10 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పసికందుకు విక్రయించిన ముఠా, నకిలీ పుట్టిన తేది పత్రం అందించిన మున్సిపాలిటీ ఉద్యోగి సహా 10 మందిని అరెస్ట్ చేశారు. పదేళ్లుగా పిల్లలు లేని దంపతులకు రూ.50వేలకు పసికందును విక్రయించినట్లు పోలీసులు కేసు నమోదుచేశారు.

2 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితుడితో పోలీసులు

పార్యీస్, మే 11 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు మోటరు సైకిల్ మీద తరలించిన 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. తూత్తుకుడి జిల్లా ఎస్పీ ఆల్బర్ట్ జాన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు శనివారం రాత్రి చిన్నకన్నుపురం ప్రాంతంలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వేగంగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తిని ఆపి, తనిఖీ చేసి అతడి వద్దనున్న 2 కిలోల గంజాయి, రూ.1000 నగదు, సెల్‌ఫోన్, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అతను మడత్తూరు చెందిన రవి కుమార్ (51)అని తెలిసింది. అతనిపై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు.

న్యాయవాది కుమారుడిపై దాడి

తిరుత్తణి, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది ధనలక్ష్మి కుమారుడైన లోకేష్ కన్నన్ (38)పై గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటన తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని చిత్తూరు రోడ్డులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే శనివారం సాయంత్రం తిరువళ్లూరులోని తన మిత్రులను కలుసుకునేందుకు వెళ్లిన అడ్వకేట్ కుమారుడు లోకేష్ కన్నన్‌ని మార్గమధ్యంలో ఐదుగురు వ్యక్తులు దాడి చేసి, తీవ్రంగా గాయపరచారు. గమనించిన స్థానికులు పెద్దగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లోకేష్‌ను ప్రభుత్వాసుపత్రి తరలించారు. హత్యా యత్నం కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

వలసరవాక్కం బంగళాలో అగ్ని ప్రమాదం

- మంటల్లో చిక్కుకుని వృద్ధ దంపతుల మృతి



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కం చౌదరి నగర్‌లోని ఓ బంగళాలో ఆదివారం ఉదయం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఓ ఫ్లాట్‌లో నివసిస్తున్న వృద్ధ దంపతులు దుర్మరణం చెందారు. ఆ బంగాళాలోని పై అంతస్తు ఫ్లాట్‌లో ఉన్నట్టుండి మంటలు రేగి క్షణాల్లో గదిలోని వస్తువులకు నిప్పంటుకుంది. దీంతో ఆ గదిలోనే బసచేస్తున్న నటరాజన్ (70), ఆయన భార్య (తంగం), వీరి కుమారుడు శ్రీరామ్ మంటల్లో చిక్కుకున్నారు. ఆ సమయంలో దట్టమైన పొగలు అలముకోవడంతో వృద్ధదంపతులు ఊపిరాడక పడిపోవడంతో వళ్లంతా నిప్పు మంటలు వ్యాపించి దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్ళి మంటలను ఆర్పేందుకు గంటకు పైగా పోరాడారు. గాయపడిన శ్రీరామ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోయంబేడు డీసీపీ అదివీర పాండ్యన్ నాయకత్వంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రి వద్ద ఎగిరిన డ్రోన్

- పరుగులు తీసిన రోగులు

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): ముండియంబాక్కం ప్రభుత్వాస్పత్రి సమీపంలో డ్రోన్ ఎగరడాన్ని గమనించిన రోగులు భయంతో పరుగులు తీశారు. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం ప్రారంభం కాగా, పాకిస్థాన్ డ్రోన్లతో దాడులు చేస్తోంది. ఈ క్రమంలో, విల్లుపురం జిల్లా ముండియంబాక్కం ప్రభుత్వాసుపత్రి పరిసర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు డ్రోన్ ఎగరడాన్ని గమనించిన చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, రోగులు, అది పాకిస్థాన్‌కు చెందిన డ్రోన్ అంటూ పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అక్కడకు చేరుకున్న విక్రవాండి పోలీసులు చేపట్టిన విచారణలో... ఆ ప్రాంతంలోని పొలాల్లో పురుగుల మందు పిచికారి పనులకు వినియోగిస్తున్న డ్రోన్ అని తెలియడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పిల్లలు లేరనే విరక్తితో దంపతుల ఆత్మహత్య

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): వివాహమై పదేళ్లు గడిచినా పిల్లలు లేరనే విరక్తితో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఈరోడ్ జిల్లాలో చోటుచేసుకుంది. సూరంపట్టి రాజాజీ వీధికి చెందిన మాదేశ్వరన్ (40)గీత (32)లకు 2015లో వివాహమైంది. వివాహమై పదేళ్లు గడిచినా పిల్లలు లేరనే బాధతో కొద్దికాలంగా దంపతులు శుభకార్యాలకు కూడా వెళ్లడం లేదని తెలిసింది. కొద్దిరోజుల క్రితం సోదరుడి ఇంటికి వెళ్లిన మాదేశ్వరన్, పిల్లలు లేరంటూ విలపించగా, అతను సోదరుడిని ఓదార్చారు. ఈ క్రమంలో, పిల్లలు లేరనే బాధతో ఆత్మహత్యకు చేసుకోవాలని నిర్ణయించిన దంపతులు, ఇంట్లో ఒకే చీరతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాదేశ్వరన్‌ను పరామర్శించేందుకు వచ్చిన సోదరుడు, దంపతులు ఆత్మహత్యకు పాల్పడడం గమనించి సూరంపట్టు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మరో 5 దశాబ్దాలు స్టాలిన్ పాలనను జనం మర్చిపోలేరు

- మంత్రి ఐ.పెరియస్వామి

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ పాలన మరో 50 ఏళ్ల రాష్ట్ర ప్రజల మనస్సుల్లో నిలిచిపోతుందని మంత్రి ఐ.పెరియస్వామి తెలిపారు. దిండుగల్ జిల్లా టి.పుదుపట్టలో డీఎంకే ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేసేలా శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి పెరియస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు 1.16 లక్షల మంది మహిళలకు ప్రోత్సాహక నిధులు అందజేస్తున్నామని, త్వరలో మరికొందరికి అందించనున్నామని తెలిపారు. అందుకోసం జూన్ మొదటి వారంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 234 స్థానాలు కైవసం చేసుకుని, మరోసారి ముఖ్యమంత్రిగా ఎంకే స్టాలిన్ పదవీ ప్రమాణం చేయనున్నారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ తగ్గించాలని మందలింపు మనవడి ఆత్మహత్య

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వాడడం తగ్గించాలంటూ బామ్మ మందలించడంతో ఆమె మనవడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానిక పల్లావరంలో చోటుచేసుకుంది. పెరుంగళత్తూర్‌కు చెందిన శివశంకర్ కుమారుడు మారియప్పన్ (10) బెంగళూరులోని పాఠశాలలో చదువుతున్నాడు. పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో మారియప్పన్ పల్లావరం సమీపంలోని పమ్మల్, ముంగిల్ ఏరి కస్తూరిభాయ్ వీధిలో ఉన్న బామ్మ ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం ఉద్యోగానికి వెళ్లిన బామ్మ, సాయంత్రం ఇంటికి రాగా మారియప్పన్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడడం గమనించి దిగ్భ్రాంతి చెందింది. సమాచారం అందుకున్న శంకర్ నగర్ పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో... మారియప్పన్ తరచూ సెల్‌ఫోన్ వాడుతుండడంతో బామ్మ మందలించడంతో బాలుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

నైవేలి కేంద్రంలో పేలిన ట్రాన్స్‌ఫార్మర్


అడయార్, మే 11 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ)లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం ఉదయం ఉన్నట్టుండి పేలిపోయింది. ఈ ప్రమాదం కారణంగా కోటి రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాద వార్త తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని, మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సివుంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పాకిస్థాన్‌ను వ్యతిరేకించడంలో అందరిదీ ఒకే మాట

- అన్నామలై

పెరంబూర్, మే 11 (ఆంధ్రజ్యోతి) పాకిస్థాన్‌ను ఎదిరించే విషయంలో డీఎంకే సహా అన్ని పార్టీలు ఐక్యంగా నిలవడం అభినందించాల్సిన అంశమని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. తూత్తుకుడిలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాద కేంద్రాలు లక్ష్యంగా చేసుకుని భారత్ దాడి చేస్తుందన్నారు. పాకిస్థాన్ సైన్యం లేదా మరే ప్రాంతంలోను దాడులు జరగడం లేదన్నారు. కానీ, భారత సరిహద్దు ప్రాంతాల్లోని అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ దాడులకు పాల్పడుతుందన్నారు. భారతదేశం 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలిగి ఉండగా, పాకిస్థాన్ కేవలం 360 బిలియన్ డాలర్లుగా ఉందన్నారు. ఏ దేశ సరిహద్దులు ఆక్రమించుకోవడానికి పోరాడడం లేదని, భారత్‌పై ఉగ్రవాద దాడిని తిప్పి కొట్టే లక్ష్యంతో 'ఆపరేషన్ సిందూర్' చేపట్టారని తెలిపారు. భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, డీఎంకే సహా అన్ని పార్టీలు పాకిస్తాన్‌ను వ్యతిరేకించేందుకు ఏకతాటిపై రావడం అభినందనీయమన్నారు. ఈ సమయంలో మనమందరూ ఐక్యంగా నిలిచి, సరిహద్దుల్లో సేవలందిస్తున్న సైనికులకు ఓదార్పునిచ్చేలా మాట్లాడాలని, వారికి సంఘీభావంగా నిలబడాలని అన్నామలై పిలుపునిచ్చారు.

కాణిపాకంలో లారీ ఢీకొని తిరువళ్లూరు కోర్టు ఉద్యోగిని మృతి



ప్రమాదానికి కారణమైన లారీ (ఇన్‌సెట్లో) సెల్వి మృతదేహం

ఐరాల(కాణిపాకం), మే 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ప్రమాదవశాత్తు లారీ ఢీకొని తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు కోర్టు ఉద్యోగిని మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కాణిపాకం పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం అరక్కోణంకు చెందిన సెల్వి(36) తిరువళ్లూరు కోర్టులో పని చేస్తోంది. ఆమె తన భర్త రమేష్‌తో కలసి వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం ద్విచక్ర వాహనంపై కాణిపాకానికి విచ్చేశారు. ఈ క్రమంలో కాణిపాకం బస్టాండు సమీపంలోని వాహన పూజ ప్రదేశంలో సీఎస్సీ పేరుతో ఉన్న లారీ పూజకు వచ్చింది. ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తున ఈ లారీని ఢీకొనడంతో.. సెల్వి లారీ చక్రాల కింద పడిపోయింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సెల్వి మృతి చెందింది. ఈ మేరకు కాణిపాకం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దర్శకుడి కల నెరవేర్చిన హీరో సూర్య

దర్శకుడు ప్రేమ్‌కుమార్ కలను హీరో సూర్య నెరవేర్చారు. ఆయనకు ఎంతో ఇష్టమైన మహీంద్రా థార్ కారు బహుమతిగా అందించారు. దీనిపై ప్రేమ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. దీంతో హీరో సూర్య, ఆయన తమ్ముడు, హీరో కార్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాన్ని ప్రేమ్ కుమార్ తన ఇన్‌స్టా పేజీలో వెల్లడించారు. 'మహీంద్రా థార్ అంటే నాకెంతో ఇష్టం. అది ఆ డ్రీమ్ వెహికల్ కూడా. మరీ ముఖ్యంగా రాక్స్ ఏఎక్స్ 5ఎల్ తెలుపు రంగు థార్ కోసం వేచి చూశా. ఎట్టకేలకు అది మార్కెట్‌లోకి రావడంతో నేను దాచుకున్న డబ్బుతో దానిని కొనుగోలు చేయాలనుకున్నా. కాకపోతే బుక్ చేశాక యేడాది పాటు ఎదురు చూడాలని తెలిసింది. ఆ తర్వాత నా దగ్గర ఉన్న డబ్బు కూడా ఖర్చు అయిపోయింది. దీంతో ఆలోచన విరమించుకున్నా. ఇటీవల హీరో సూర్య నుంచి నాకొక సందేశం వచ్చింది. నాకెంతో ఇష్టమైన కారు ఫొటో పంపించి.. కారు వచ్చేసింది అని అన్నారు. నాకేం అర్థం కాలేదు ఫొటో చూసి ఒక్కసారిగా షాకయ్యారు. సూర్య నా కోసం ఈ కారు కొని గిఫ్టుగా ఇచ్చారు. కార్తి చేతుల మీదుగా కారు తాళాలు అందుకున్నా. దీనిని నేను గిఫ్ట్‌గా చూడను. ఒక అన్న తన తమ్ముడి కలను నెరవేర్చినట్టు చూస్తా' అని పోస్ట్ చేశారు. కాగా గత యేడాది ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో కార్తి, అరవింద్ స్వామి ప్రధాన పాత్రను పోషించిన 'మెయ్యళగన్' మూవీ విడుదలై ఘన విజయం సాధించింది. 2డీ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై హీరో సూర్య, జ్యోతిక దంపతులు నిర్మించారు.



మహీంద్రా థార్ కారు వద్ద ప్రేమ్‌కుమార్, కార్తి

ప్రతి ఒక్కరి జీవితాల్లో జరిగే కథే 'మామన్'



● హీరో సూరి

తాను నటించిన 'మామన్' చిత్రం ప్రతి ఒక్కరి జీవితాల్లో జరిగే కథేనని, కుటుంబ సమేతంగా చూడొచ్చని ఆ సినిమా హీరో సూరి అన్నారు. ప్రశాంత్ పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సూరి సరసన ఐశ్వర్య లక్ష్మి నటించగా, రాజ్‌కిరణ్, శ్వాసిక, బాలశరవణన్, జయప్రకాష్, విజీ చంద్రశేఖర్, గీతా కైలాసం, నిఖిలా శంకర్, మాస్టర్ ప్రగీత్ శివన్, చాయాదేవి తదితరులు నటించారు. లార్క్ స్టూడియో పతాకంపై కె.కుమార్ నిర్మించారు. 16వ తేదీ విడుదలకానున్న ఈ చిత్ర విశేషాలను హీరో సూరి నగరంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. "మామన్ ఒక కుటుంబ కథాచిత్రం, కుటుంబ సభ్యులంతా కలిసి చూడాల్సిన మూవీ. దర్శకుడు కథ చెప్పగానే నాకు ఎంతో నచ్చింది. పల్లెటూరు కుటుంబంలో నడిచే విచిత్రమైన స్టోరీ. నేను నటించిన 'విడుదలై', 'గరుడన్' తరహాలో కాకుండా, 'మామన్'లో మంచి పోరాట సన్నివేశాలు, ఆసక్తికరమైన పాటలు, మంచి సందేశం ఉన్నాయి. చిత్రంలో హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మితో ఎంచి కెమిస్ట్రీ ఉంది. నేను పెద్ద హీరోలతో పోటీ పడటం లేదు. అలాగే, నా నటనకు తగిన విధంగా నిర్మాతలు పారితోషికం ఇస్తున్నారు. ప్రత్యేకించి నేను నాకింత ఇవ్వాలని డిమాండ్ చేయడం లేదు. రాజకీయాల్లోకి వచ్చే వారికి నా శుభాకాంక్షలు. నాకు రాజకీయాలు తెలియవు. జీవితాంతం నటుడిగానే కొనసాగుతాయి. 'మందాడి' భారీ బడ్జెట్ చిత్రం. అందులో నటించడం నా అదృష్టం. ఆ చిత్రంలో సముద్రంపై సాగే పడవ పందాల పోటీలు ఆసక్తికరంగా ఉంటాయి. 'మామన్' చిత్రం విడుదలకాగానే 'మందాడి' సినిమా షూటింగ్ ప్రారంభమవుతుంది. ఈ నెల 16న సంతానం 'డెవిల్స్ డబుల్ నెక్స్ లెవెల్', యోగిబాబు 'జోరా కై తట్టుంగ' విడుదలవుతున్నాయి. అవి కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు.



'మామన్'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

జూలై 10న శశికుమార్ 'ఫ్రీడమ్'

శశికుమార్, సిమ్రన్ జంటగా నటించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రం ఘన విజయం సాధించింది. ఈ చిత్రం సక్సెస్‌ను హీరో శశికుమార్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నటించిన 'ఫ్రీడమ్' చిత్రాన్ని జూలై 10వ తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ, ఈలం తమిళులకు సంబంధించిన అనేక అంశాలను ఆధారంగా చేసుకుని రూపొందించారు. శశికుమార్ సరసన లిజోమోల్ జోస్ నటించగా, మాళవికా అవినాస్, బోస్ వెంకట్ తదితరులు ఇతర ప్రధాన పాత్రలను పోషించారు. ఈ చిత్రానికి సత్యశివ దర్శకత్వం వహించగా విజయగణపతి పిక్చర్స్ పతాకంపై పాండియన్ పరశురామన్ నిర్మించారు.



14న యథావిధిగా షూటింగులు

● మురళి రామస్వామి



ఈ నెల 14వ తేదీన రాష్ట్రంలో యధావిధిగా షూటింగులు జరుగుతాయని తమిళ చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు మురళి ఎన్.రామస్వామి స్పష్టం చేశారు. ఈ విషయంపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 'ఈ నెల 14వ తేదీ దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘ సమాఖ్య ఫెఫ్సీ సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. కానీ, ఆ సమ్మెకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పైగా తమిళ సినీ నిర్మాతల మండలి ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటైన తమిళనాడు చలనచిత్ర కార్మికుల సమాఖ్యకు చెందిన సినీ నిర్మాణ కార్మికులు యధావిధిగా షూటింగులకు హాజరవుతారన్నారు. అదేసమయంలో ఫెఫ్సీ కార్మికులకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించకూడదని తాము చెప్పలేదని, ఈ విషయంలో ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కె సెల్వమణి దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వరదరాజ పెరుమాళ్ ఆలయంలో వైకాశి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో అత్తివరదర్ ఆలయం వరదరాజపెరుమాళ్ ఆలయ వైకాశి బ్రహ్మోత్సవాలు ఆదివారం వేకువజాము ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆ సందర్భంగా వేకువజాము 4 గంటలకు ఆలయ గర్భాలయం నుండి ఉత్సవమూర్తి వరదరాజపెరుమాళ్ భూదేవి, శ్రీదేవి సమేతుడై ధ్వజస్తంభ మంటపం వద్ద వేంచేశారు. ఆ తర్వాత గరుత్మంతుని చిత్రంతో ఉన్న ఉన్న ధ్వజ పటాన్ని భట్టాచార్యులు వైష్ణవపండితుల మంత్రోచ్చారన, మంగళవాయిద్యాల నడుమ ధ్వజస్తంభంపై ఎగురవేశాను. ధ్వజారోహణం సందర్భంగా అలంకార మండపంలో వరదరాజపెరుమాళ్ శ్రీదేవీ, భూదేవీ సమేతుడై ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగారు ఈ ఉత్సవాలలో భాగంగా ఈ నెల 13న గరుడ సేవ, 17న మహారథోత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 19న తీర్థవారి వేడుకలతో ఈ బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ముగిసిన ఓపీఎస్ కాశీ యాత్ర రామేశ్వరం ఆలయంలో ప్రత్యేక పూజలు



రామేశ్వరం ఆలయంలో గంగపూజ నిర్వహిస్తున్న ఓపీఎస్

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): మాజీముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) కాశీయాత్ర ముగించుకుని ఆదివారం ఉదయం రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామివారి ఆలయానికి కుటుంబ సమేతంగా వెళ్ళి దర్శనం చేసుకున్నారు. ఆ సందర్భంగా గంగా జలాలతో ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఓపీఎస్ ఇటీవల మృతి చెందిన తన సతీమణి ఆత్మ శాంతి కోసం ఈ నెల 2న రామేశ్వరం నుండి కాశీకి బయలుదేరారు. కాశీయాత్ర ముగించుకుని అక్కడి పవిత్రగంగాజలాన్ని తీసుకువచ్చి ఆదివారం ఉదయం రామనాథస్వామి ఆలయంలో విశ్వనాధుడి సన్నిధి ఎదుట గంగపూజ నిర్వహించారు. ఆ తర్వాత రామనాథస్వామికి అభిషేకం చేయించారు.

ద్రౌపది ఆలయంలో చిత్తిరై వేడుకలు

● ఆకట్టుకున్న భక్తుల విన్యాసాలు

తిరుత్తణి, మే 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన ద్రౌపది అమ్మన్ ఆలయంలో చిత్తిరై వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రాంతంలోని ప్రతి ఏటా చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వివిధ వాహనాల్లో ఊరేగిస్తారు. ఈ వేడుకల్లో భాగంగా పుదుపేట, కుమారరాజుపేట, ఇచ్చాంబడి, వెంకటరాజుకుప్పం తదితర ప్రాంతాల సహా పొరుగు రాష్ట్రాలనుండి వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం ఉదయం దుర్యోధన వధ జరిగింది. అలాగే అమ్మవారికి అభిషేకించేందుకు పాల కలశాలతో ఆలయానికి చేరుకుని అర్చకులకు అందించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ట్రాక్టర్లపై వచ్చిన భక్తులు శరీరానికి శూలాలు గుచ్చుకొని, వాహనంపై వేల్లాడుతూ విన్యాసాలు చేస్తూ అమ్మవారిని సేవించుకున్నారు.



శూల కావడి ప్రదర్శనలో భక్తులు

పల్లకీలో వేంచేసిన కళ్లలగర్



స్వర్ణపల్లకీలో మదురై బయల్దేరిన కళ్లలగర్ స్వామి

● జేజేలు పలుకుతూ స్వాగతం పలికిన భక్తులు

టి.నగర్ మే 11 (ఆంధ్రజ్యోతి): తమిళ సాహిత్య, సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన మదురై నగర సామ్రాజ్ఞి మీనాక్షి అమ్మవారి ఆలయ చిత్తిరై ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటైన, తిరుమాలిరుంజోలై,తెన్ తిరుపతిగా పిలిచే అళగర్‌కోవిల్ పర్వతం దిగువనున్న కళ్లలగర్ ఆలయ చిత్తిరై ఉత్సవాలు ఊపందుకున్నాయి.రెండు రోజులపాటు ఆ క్షేత్రంలో వివిధ పుష్పాలంకరణలు, స్వర్ణాభరణాలు, వజ్రాభరణాలు ధరించి సర్వాలంకరణ శోభితుడై భక్తులను అనుగ్రహించిన కళ్ళలగర్‌స్వామి వారు శనివారం సాయంత్రం స్వర్ణపల్లకీలో మదురై నగరానికి బయలుదేరారు.



కళ్ళలగర్‌కు పెద్ద వింజామరాన్ని తీసుకెళుతున్న భక్తుడు





కరుప్పణ్ణస్వామి ఆలయం వద్ద దివిటీలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు - కరుప్పణ్ణస్వామి అనుజ్ఞ కోసం విచ్చేసిన స్వామివారు

ముగిసిన తిరుత్తణి ఆలయ ఉత్సవాలు

తిరుత్తణి, మే 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ క్షేత్రంలో ఈ నెల 1వ తేదీ ప్రారంభమైన చిత్తిరై బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారభమైనప్పటి నుండి వివిధ వాహనాల్లో విశేష అలంకరణలతో సుబ్రహ్మణ్యస్వామివారు ఊరేగారు. ఈ నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజాము 5 గంటల నుండే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాలనుండి పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు క్యూలైన్లలో గంటసేపు వేచివుండి స్వామివారిని దర్శించుకున్నారు.



మైలాడుదురైలో 54 అడుగుల శివలింగ ప్రతిష్ఠ

● భక్తిపారవశ్యంతో నృత్యం చేసిన విదేశీయులు

ప్యారీస్, మే 11 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై సమీపంలోని దారుకావనం సిద్ధ పీఠంలో ఆదివారం 54 అడుగుల ఎత్తుతో రూపొందించిన శివలింగ ప్రతిష్ఠ ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ వేడుకల్లో రష్యా, గజకిస్థాన్, జపాన్, సింగపూర్, మలేసియా సహా 10 దేశాలకు చెందిన భక్తులు పాల్గొని పారవశ్యంతో నాట్యం చేశారు. సిద్ధ పీఠం దక్షిణామూర్తి నేతృత్వంలో ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు, నవగ్రహ హోమం, యాగశాల పూజలను శివాచార్యులు నిర్వహించారు. యాగశాలలో పూజలు నిర్వహించిన పవిత్ర జల కలశాలను మేళతాళాలు, భక్తుల శివ నామస్మరణల మధ్య ఊరేగించి శివలింగం ప్రతిష్ఠించిన వేదికవద్దకు తీసుకెళ్ళారు. అనంతరం వేదమంత్రోచ్చారణ మధ్య 54 అడుగుల శివలింగాన్ని ఆవిష్కరించి, మహాఅభిషేకం చేశారు. అలాగే మహానంది విగ్రహానికి విశేష పూజలు జరిపారు. ఈ వేడుకల్లో విదేశీ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనడంతో వారికి పోలీసులు తగిన భద్రత కల్పించారు. సోమవారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఈ పీఠంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శివలింగ ప్రతిష్ఠ వేడుకల్లో నాట్యం చేస్తున్న విదేశీయులు





ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న పరమేశ్వరన్‌ను పరామర్శిస్తున్న ఏకేఎస్ విజయన్

ఉగ్రవాదుల కాల్పుల్లో తమిళ జవానుకు గాయాలు

● ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స

అడయార్, మే 11 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో ఉగ్రవాదుల దాడుల్లో తమిళనాడుకు చెందిన జవాను పరమేశ్వరన్ గాయపడ్డారు. దీంతో ఆయనను ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాల మేరకు ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఏకేఎస్ విజయన్ వెళ్ళి జవానును పరామర్శించారు. అలాగే, పరమేశ్వరన్‌కు వైద్యం చేస్తున్న వైద్యులతో ఆయన మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వెళ్ళిన వారిలో తమిళనాడు ప్రభుత్వ కమిషనర్ ఆశీష్ కుమార్ తదితరులు ఉన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ సాయంతో పంజాబ్ నుంచి తిరిగొచ్చిన విద్యార్థికి మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్‌లో ఆహ్వానిస్తున్న మంత్రి నాజర్

పర్యాటక ప్రాంతాలకు పోటెత్తిన సందర్శకులు





కుమరి సముద్రతీరంలో... - కన్నియాకుమారి త్రివేణి సంగమం వద్ద సూర్యోదయాన్ని తిలకించడానికి గుమికూడిన పర్యాటకులు

అడయార్, మే 11 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికితోడు వేసవి, వారాంతపు సెలవులు తోడుకావడంతో రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా ఊటీ, కొడైక్కెనాల్, ఏర్కాడు, కన్నియాకుమారి వంటి కొండ ప్రాంతాల పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు పోటెత్తారు. నీలగిరి జిల్లాలోని ఊటీ, దిండిగల్ జిల్లాలోని కొడైక్కెనాల్‌లో సీజన్ ప్రారంభంకావడంతో ఇక్కడకు పర్యాటకులు వచ్చేందుకు అమితాసక్తిని చూపుతున్నారు. ముఖ్యంగా ఊటీలో 20వ రోజాల ప్రదర్శన ప్రారంభమైంది. దీంతో రెండో రోజైన ఆదివారం ఊటీ గార్డెన్‌కు భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకుల తాకిడి కేవలం ఫ్లవర్ గార్డెన్‌లో మాత్రమే కాకుండా బొటానికల్ గార్డెన్, బోట్ హౌస్, తొట్టబెట్టా హిల్ స్టేషన్ తదితర ప్రాంతాలకు పర్యాటకులు తరలివచ్చారు. అదేవిధంగా కొడైక్కెనాల్‌లో శని, ఆదివారాల్లో పర్యాటకు భారీగా తరలివచ్చారు. అయితే ఈ హిల్ స్టేషన్‌పై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సాధారణ రోజుల్లో 4 వేల వాహనాలు, వారాంతపు రోజుల్లో 6 వేల వాహనాలను అనుమతిస్తున్నారు. అయితే, ఇక్కడ సీజన్ ప్రారంభం కావడంతో కొండపైకి అధిక సంఖ్యలో వాహనాలను అనుమతించే అవకాశం ఉంది. అదేవిధంగా సేలం జిల్లాలోని ఏర్కాడు కొండ ప్రాంతానికి కూడా పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. ఇకపోతే, రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన కన్నియాకుమారిలో వివేకానంద రాక్‌ఫోర్ట్, తిరువళ్ళువర్ విగ్రహం, త్రివేణి సంగమం వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు పర్యాటకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి భారీగా తరలివచ్చారు.







ఊటీలో ఆకట్టుకుంటున్న పూలతో తయారైన బొమ్మలు

మదురైలో కళ్లలగర్ వేషంతో విజయ్ పోస్టర్లు

చెన్నై, మే 11 (ఆంధ్రజ్యోతి): మదురై నగరంలో సోమవారం వేకువజామున వైగైనదీలో కళ్ళలగర్ ఆగమన ఉత్సవాలు జరుగనుంది. ఈ నేపథ్యంలో ఆ నగరమంతటా అతికించిన తమిళగ వెట్రి కళగం నేత విజయ్ కళ్ళలగర్ స్వామి వేషధారణలో ఉన్న పోస్టర్లు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. కళ్ళలగర్‌ను స్వాగతిస్తూ ముద్రించిన ఈ పోస్టర్లను చూసి అన్నాడీఎంకే, డీఎంకే సహా అన్ని పార్టీల నాయకులు విస్తుపోతున్నారు. ఇప్పటి వరకూ కళ్ళలగర్ వేషధారణలో ఏ పార్టీ నాయకుడూ తన పోస్టర్లను మదురైలో అతికించలేదని స్థానికులు చెబుతున్నారు. టీవీకే స్థానిక నాయకుడు విజయ్ అన్వర్ విను పేరుతో ముద్రించిన ఈ పోస్టర్‌లో నటుడు విజయ్ కళ్ళలగర్ వేషంతో వంటి నిండా నామాలు ధరించినట్టు ముద్రించి ఉంది. 'తమిళ రాష్ట్ర దళపతి నీ రాక వల్ల రైతులు ఉన్నతి స్థితికి చేరుకోవాలి' అనే నినాదం కూడా ఆ పోస్టర్‌లో ఉంది. ప్రస్తుతం ఈ పోస్టర్లు మదురై నగరమంతటా వివాదాస్పదంగామారింది.



మదురై నగరంలో అతికించిన పోస్టర్





మహాబలిపురం సమీపం తిరువిడందై వద్ద ఆదివారం సాయంత్రం చిత్రాపౌర్ణమి సందర్భంగా ప్రారంభమైన పీఎంకే యువజన మహానాడులో పాల్గొన్న ఆ పార్టీ నేతలు డాక్టర్ రాందాస్, డాక్టర్ అన్బుమణి, జీకే మణి, ఏకే మూర్తి తదితరులు